# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 19-08-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. పౌరసత్వ సవరణ చట్టం ద్వారా దేశంలోని ఏ ఒక్కరి పౌర సత్వాన్ని తొలగించడం జరగదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీలో పర్యటించనున్నారు.
3. రాష్ట్రంలో గ్రామ సభల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించనున్నారు.
4. తెలంగాణలో దసరా నుంచి యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు.
5. ఈరోజు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

==========================

పౌరసత్వ సవరణ చట్టం సీఏఏ ద్వారా దేశంలోని ఏ ఒక్కరి పౌర సత్వాన్ని తొలగించడం జరగదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దానికి బదులు అర్హత కలిగిన పౌరులకు హోదా కల్పించడమే చట్టం చేసే పని అని అన్నారు. సీఏఏ అన్నది పౌరసత్వాన్ని మంజూరు చేయడానికే ఉద్దేశించినది అని పేర్కొన్నారు. పౌరసత్వ సవరణ చట్టం –సీఏఏ కింద 188 మంది హిందూ ప్రవాసులకు అమిత్ షా నిన్న అహ్మదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పౌరసత్వ ధృవీకరణ పత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశంలో ఆశ్రయం పొందిన వ్యక్తులకు పౌరసత్వ ధృవీకరణ పత్రాలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. శ్రీసిటీలో 15 సంస్థల కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు మరో 7 సంస్థలకు శంకుస్థాపన చేస్తారు. 9 వందల కోట్ల రూపాయల పెట్టుబడితో 2 వేల 740 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. అలాగే మరో ఒక వెయ్యి 213 కోట్ల రూపాయల పెట్టుబడులకు ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుందని, శ్రీసిటీ వాణిజ్య కేంద్రంలో వివిధ సంస్థల సీఈవోలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు.

శ్రీ సిటిలో ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన అనంతరం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టును కూడా ఆయన సందర్శించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సభల నిర్వహణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించనున్నారు. ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులతో సంభాషించనున్నారు. ఈ రోజు జరగనున్న ఈ సమావేశానికి పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని గుంటూరు జిల్లా పరిషత్తు సీఈవో వసంతరాయుడు వివిధ విభాగాల అధికారులకు సూచించారు. వికసిత భారత్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామసభల నిర్వహణపై అధికారులకు పవన్ కల్యాణ్ మార్గదర్శనం చేయనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణలో విజయదశమి నాటికి యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి చెప్పారు. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నైపుణ్య విశ్వవిద్యాలయ ప్రారంభం, విధి విధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొత్తం 20 కోర్సులు ప్రారంభించాలని భావించామని, ఈ సారి ఆరు కోర్సులను ప్రారంభిస్తామని అన్నారు. ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో ఈ విశ్వవిద్యాలయం నిర్మాణ పనులు ముగిసేంతవరకు తాత్కాలిక భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నైపుణ్య విశ్వవిద్యాలయానికి సంబందించిన లోగోను, వెబ్ సైట్ ను ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

---------------------------

అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను దేశ వ్యాప్తంగా ఈరోజు ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. రక్త బంధం కలకాలం వర్ధిల్లాలని కాంక్షిస్తూ అన్న, తమ్ముళ్ళకు అక్కా చెల్లెళ్ళు రాఖీలు కట్టడం, ఉభయులు పరస్పరం మిఠాయిలు పంచుకోవడం రాఖీ పండుగ ఆనవాయితి. రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ళ మధ్య ప్రత్యేకమైన బంధానికి గుర్తుగా రక్షా బంధన్ జరుపుకుంటారని అన్నారు.

---------------------------

మంకీపాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ – డబ్ల్యూహెచ్‌వో అత్యవసర పరిస్థితి ప్రకటించిన నేపథ్యంలో వైరస్ వ్యాప్తి నివారణ, సంసిద్ధతపై ప్రధానమంత్రి ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి పీకే మిశ్రా నిన్న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు దేశంలో మంకీపాక్స్ కేసు నమోదు కాలేదని, భారీ స్థాయిలో వ్యాప్తిచెందే ముప్పు తక్కువేనని అంచనా వేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీనిపై ప్రధానమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపాయి. మరోవైపు ఆఫ్రికా దేశాల్లో మంకీపాక్స్ కేసుల సంఖ్య 18 వేల 737కు చేరింది. ఈ అంటువ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతోన్న నేపథ్యంలో ఎంపాక్స్ వైరస్ కట్టడికి తాము ఏర్పాటు చేసిన అత్యవసర కమిటీ సిఫార్సులను త్వరలోనే విడుదల చేస్తామని డబ్ల్యూహెచ్‌వో ప్రకటించింది.

---------------------------

ఈరోజు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. 1918 ఆగస్టు 19న మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ నగరంలో జన్మించిన ఆయన... దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. భారత స్వాతంత్ర్య సాధన కోసం ఆయన ఎనలేని పోరాటం చేశారు. తన వాక్చాతుర్యంతో ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. గొప్ప పండితుడు, మేధావి అయిన శంకర్ దయాళ్ శర్మ.. స్వాతంత్ర్యానంతరం మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్, దేశ 9వ రాష్ట్రపతిగా పలు కీలక పదవులు నిర్వహించి... దేశానికి సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారు. 1999 అక్టోబర్ 9వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి నవంబర్ నెల కోటాకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్లను ఈరోజు ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 21 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కాగా, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లతో పాటు నవంబరు నెల 9న శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పుష్పయాగం సేవ టికట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారని అధికారులు వెల్లడించారు. కాగా.. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమల ఆలయంలో ఈరోజు సాయంత్రం గరుడ సేవ జరగనుంది.

---------------------------

భవిష్యత్ తరాలకు సర్వాయి పాపన్న స్ఫూర్తి గాథలు తెలియజేసేలా ఆయన స్వగ్రామాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిన్న సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి  పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,. పాపన్న గౌడ్ పర్యాటక కేంద్రానికి 4 కోట్ల 70 లక్షల రూపాయలు కేటాయించినట్లు వివరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శమని,. చరిత్రలో నిలిచిపోయేలా సర్వాయిపేట కోటను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్  ప్రభుత్వం పది మంది డీఎస్పీలను బదిలీ చేసింది. శ్రీకాకుళం, అనకాపల్లి ఎస్‌డీపీవోలుగా సీహెచ్ వివేకానంద, ఎం.శ్రావణిలను నియమించింది. విశాఖపట్నం ఉత్తర మండలం ఏసీపీ బి.సునీల్, విశాఖపట్నం హార్బర్ ఏసీపీ బి.మోజేస్ పాల్, అనకాపల్లి ఎస్‌డీపీవో ఎస్.అప్పలరాజులను బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని వారిని ఆదేశించింది. ఈ మేరకు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు  నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

ఆకాశవాణిలో సంస్కృత వార్తా ప్రసారాలు ప్రారంభించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తావిభాగం రూపొందించిన “వందే సంస్కృత మాతరం” ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

హైదరాబాద్‌లో నిన్న తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ– సీఎల్పీ సమావేశం జరిగింది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ తీర్మానం చేసింది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, అభిషేక్ మను సింఘ్వీ శాసన సభ్యులతో పాటు పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈరోజు ఉదయం 11 గంటలకు రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

======================